మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా విశ్వనాథ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:స్థానిక మండల పరిషత్తు కార్యాలయం పరిపాలన అధికారిగా చింతర్ల విశ్వనాథ్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేసిన ఆయన పదోన్నతిపై పరిపాలన అధికారిగా జిల్లా పరిషత్తు అధికారులు నియమించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథ్

అమరుల స్ఫూర్తితో పోరాటాలు

- ★ ఎర్రజెండా ఉద్యమాలతో ఆదివాసీలకు సౌకర్యాలు
- ★ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై బాబు, జగన్ మౌనం దారుణం
- ★ సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- ★ పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచుతామంటే సహించం : వి.శ్రీనివాసరావు హెచ్చరిక
- ★ చింతూరులో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ, ర్యాలీ
- ★ భారీగా తరలొచ్చిన ఆదివాసీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు విలేకరి

ప్రజల తరపున పోరాడిన నిజమైన విప్లవకారులు మార్క్సిస్టులని, గిరిజన ప్రాంతాల్లో ఈ మేరకైనా విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించబడ్డాయంటే ఎర్రజెండా పోరాట ఫలితమేనని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. పోరాటాలను రాబోయే రోజుల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అమరవీరుల స్ఫూర్తితో యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం అమరవీరుల సంస్మరణ సభ చింతూరులోని పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగింది. పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ చింతూరు ఏజెన్సీలో బత్తుల భీష్మారావు, బండారు చంద్రరావులు అలుపెరగని పోరాటాలు నిర్వహించారన్నారు. వారిని అప్పట్లో మావోయిస్టులు పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. ఆ తరువాతా హత్యాకాండ కొనసాగిందన్నారు. ఆ తరుణంలో ఓవైపు పాలకులు, మరోవైపు మావోయిస్టుల నిర్బంధాలను ఎదుర్కొని గిరిజన ప్రజలకు అండగా నిలబడి సిపిఎం నేతలు అనేక సేవలందించారని వివరించారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నేడు రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరుగుతున్నా చంద్రబాబు, జగన్ నోరెత్తడం లేదని మండిపడ్డారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని అన్నారు. 79 శాతం నిర్మాణం పూర్తి చేసినప్పటికీ పునరావాసం కేవలం 22 శాతం మాత్రమే కల్పించారన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పించకుండా గోదాట్లో ముంచేస్తామంటే సహించబోమని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వానికి గిరిజనుల పట్ల కనీస గౌరవం లేదన్నారు. గిరిజనులు అంటే చైతన్యానికి, పోరాటాలకు మారుపేరని వివరించారు. గిరిజన యువత ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. జిఒ నెంబర్ 3 కోసం తక్షణమే ఆర్డినెన్స్ తీసుకురావాలని, ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ సంపదను అదాని, అంబానీలకు ధారాదత్తం చేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు. బ్రిటిష్ తరహాలో మోడీ, చంద్రబాబు పాలన ఉందని మండిపడ్డారు. గంజాయి నిర్మూలన కోసం జరిగే పోరాటాలలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడుతూ ఎర్ర జెండా గత వైభవాన్ని పునరుద్ధరించేందుకు యువత సిద్ధం కావాలన్నారు. పోలవరం నిర్వాసితులకు అండగా ఢిల్లీలో పోరాటం చేయడంతో పాటు 450 కిలోమీటర్లు పాదయాత్ర చేసి నిర్వాసితులకు అండగా నిలబడింది సిపిఎం ఒక్కటేనని అన్నారు. ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే శిరీషాదేవి, ఎంపీ తనుజారాణి ఎందుకు చేయలేరని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వానికి ప్రత్యక్షంగా తెలుగుదేశం, జనసేన మద్దతు ఇస్తుంటే, పరోక్షంగా వైసిపి మద్దతిస్తోందని అన్నారు. రంపచోడవరం జిల్లా ఏర్పాటు సిపిఎం పోరాట ఫలితమన్నారు. పార్టీలకు అతీతంగా పోరాటాలలో కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అమరవీరుడు బత్తుల భీష్మారావు సతీమణి హైమావతి మాట్లాడుతూ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అమరవీరుల సంస్మరణ సభలో అత్యధిక మంది యువత పాల్గొనడం అభినందనీయమని అన్నారు. అమరవీరుల కలలను నిజం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర నాయకులు ఎజె.రమేష్, నర్సారెడ్డి, రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, సున్నం రాజులు, లోతా రామారావు, పి.వెంకట్, మట్ల వాణిశ్రీ, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, నాయకులు మేకల నాగేశ్వరరావు, పులి సంతోష్ కుమార్, బొర్రయ్య, అర్జున్, సోయం చినబాబు, పాయం సీతారామయ్య, సీసం సురేష్, మడకం నాగమణి, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

చింతూరు ఎరుపుమయం

అమరవీరుల సంస్మరణ సభ, ర్యాలీ నేపథ్యంలో చింతూరు ఎరుపెక్కింది. తొలుత ఎర్రంపేటలోని కల్లేరు జంక్షన్ నుండి ర్యాలీ ప్రారంభమైంది. ఎర్రజెండాలతో కవాతు ఉత్తేజంగా సాగింది. గిరిజన సంప్రదాయ నృత్యాలైన కొమ్ము డోలు డ్యాన్సులు, థింసా ఆకట్టుకున్నాయి. ర్యాలీ అగ్రభాగాన బివి.రాఘవులు, వి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అమరవీరులకు జోహార్లు అంటూ సాగిన ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్ మీదుగా అంబేద్కర్, ఇందిర, రాజీవ్, మన్యం వీరుల విగ్రహాల వరకు కొనసాగింది. అనంతరం పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సంస్మరణ సభ జరిగింది. అమర వీరులను స్మరించుకుంటూ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు రాఘవులు, శ్రీనివాసరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అమరవీరుల సంస్మరణ ర్యాలీలో రాఘవులు, వి.శ్రీనివాసరావు తదితరులు

నృత్యాలతో ఉత్తేజం నింపిన ఆదివాసీ కళాకారులు

అమరవీరుల సంస్మరణ సభకు భారీగా తరలొచ్చిన ప్రజానీకం

రగ్గులు పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నేతలు

అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సహకారంతో
ఆదివాసీలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:చలితో తీవ్రంగా బాధపడుతున్న ఆదివాసీలకు సీతమ్మధారకు చెందిన అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆదివాసులకు రగ్గుల పంపిణీ చేశారు. అనంతగిరి, అరకులోయ మండలాల్లోని గిరిజనులకు 500 రగ్గులను పంపిణీ చేశారు. అరకువేలి మండలంలోని చినలబుడు పంచాయతీ పరిధిలోని తురాయిగూడ, కరాయిగూడ గ్రామాల్లో రగ్గులు అందజేసినట్లు అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి ప్రభాకర రావు తెలిపారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీలకు అవసరమైన సహాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ, సేవాభావంతో రగ్గులు పంపిణీ చేసిన అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందుకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కాంతారావు, మాజీ సర్పంచ్ పితంబర్, ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు జగన్నాధం, కె.రామారావు, ముకుందు, కొండలరావు, మొద్దు, సహదేవ్ పాల్గొన్నారు.

అనంతగిరి :మండలంలోని కరాయిగుడలో పంచాయతీ పరిధి తురాయిగూడలో రగ్గులు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి ప్రభాకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ ప్రతి ఏడాది గిరిజన ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాంతారావు, జగన్నాథం, రామారావు, కొండలరావు, మధు, సహదేవ్ పాల్గొన్నారు.

ఎస్ఐని సత్కరిస్తున్న సిబ్బంది

ఎస్ఐ రామకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: స్థానిక ఎస్సై జె రామకృష్ణ విజయనగరం జిల్లాకు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో స్టేషన్స్ సిబ్బంది, ఏపీ ఎస్పీ, సిఆర్పిఎఫ్ జవాన్లు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెదబయలు, జి.మడుగుల ఎస్సై లు హాజరయ్యారు. ఎస్సై రామకృష్ణను ఘనంగా సన్మానించారు. గంజాయి నిర్మూలన, కూంబింగ్, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎస్ఐ కృషి చేశారని కొనియాడారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసి గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహించడం ఆనందదాయకమన్నారు.

గిరిజనుల వలలో అరుదైన చేప

గిరిజనులకు చిక్కిన చేప

ప్రజాశక్తి-సీలేరు: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు బలిమెల రిజర్వాయర్‌లో అరుదైన దోబీ జాతికి చెందిన చేప గిరిజనుల వలకి చిక్కింది. సరిహద్దు ప్రాంతంలో గిరిజనులు జీవనోపాధి నిమిత్తము ఎన్నో ఏళ్లగా బలిమెల రిజర్వాయర్లో చేపల వేట చేస్తున్నారు. ఆదివారం గిరిజనులు చేపల వేటకు వెళ్లగా వలకు 55 కేజీలు బరువు గల అరుదైన చేప లభ్యం కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి చేపలు అరుదుగా లభ్యం అవుతుంటాయని గిరిజనులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న సీలేరు బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర రావు ఆసక్తి కనబరిచి15,000కి కొనుగోలు చేశారు. చేపను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

కోడిపందాలు ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, రంపచోడవరం డిఎస్పి జిఎస్ ప్రశాంత్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్ పర్యవేక్షణలో ఆదివారం రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో లబ్బర్తి గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న 6 గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.4,100 నగదు, 2 కోడిపుంజులు, 2 కోడికత్తులను సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాజ ఒమ్మంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చిత్తులాట,పేకాట, కోడిపందాలు వంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని చట్టప్రకారం కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

మొరాయించిన ట్యాంకర్ .. నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రం సమీపంలో సాంకేతిక లోపాలు తలెత్తి ట్యాంకర్ ప్రధాన రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. రాజమండ్రి నుంచి సీలేరు పెట్రోల్ బంకుకు డీజిల్ తీసుకువస్తున్నారు. అకస్మాత్తుగా డీజిల్ ట్యాంకర్ మరమ్మత్తులుకు గురైంది. వెంటనే ట్యాంకర్ డ్రైవర్ స్థానిక మెకానిక్ ని సంప్రదించి తీసుకురాగా గేర్‌బాక్స్‌లో సమస్య వల్ల నిలిచిపోయినట్లు గుర్తించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జైపూరు వయా సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే బస్సులో 25 మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ స్పందించి ట్రాఫిక్‌ని పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టారు.

కాలగర్భంలోకి ఖజానా చెస్టులు!

- నిర్లక్ష్యానికి గురవుతున్న 140 ఏళ్ల వారసత్వ సంపద
- చింతపల్లి సబ్ ట్రెజరీలో మూలకు చేరిన బ్రిటీష్ ఆనవాళ్లు

మూలకు చేరడంతో తుప్పు పట్టిన ఇనుప చెస్ట్

ప్రజాశక్తి - చింతపల్లి : చింతపల్లి సబ్ ట్రెజరీ కార్యాలయంలో బ్రిటిష్ పాలన కాలానికి చెందిన విలువైన అభివద్ధి ఆనవాళ్లు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నప్పటికీ, అవి కాలగర్భంలో కలిసిపోతున్న పరిస్థితి నెలకొంది. సుమారు 140 సంవత్సరాల క్రితం తయారైన మూడు టన్నుల బరువైన ఇనుప ఖజానా చెస్ట్ ప్రస్తుతం కార్యాలయంలో మూలన నిర్లక్ష్యంగా పడిఉంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో బ్రిటిష్ కాలం నుంచి ప్రభుత్వానికి సేవలు అందించిన రెండు చెక్క ఖజానా చెస్టులు, ఒక భారీ ఇనుప చెస్ట్ ఉన్నాయి. వీటిలో సుమారు మూడు వేల కిలోల బరువున్న ఇనుప చెస్ట్‌లో ఒక సమయంలో మూడు కోట్ల రూపాయలకు పైగా నగదును నిల్వ చేసి, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు వినియోగించేవారని తెలుస్తోంది.

అలాగే చెక్కతో తయారై, ఇనుప తాపడం కలిగిన చెస్టుల్లో నగదుతో పాటు ప్రభుత్వానికి చెందిన అత్యంత విలువైన కీలక పత్రాలు, రికార్డులను భద్రపరిచేవారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే, 1884లో మద్రాసులో తయారైన ఈ ఇనుప చెస్ట్‌కు సంబంధించిన పైకప్పు ఒక్కటే సుమారు 500 కిలోల బరువు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద బ్రిటిష్ సామ్రాజ్యపు ఇనుప అభివృద్ధి ఆనవాళ్లు నేటికీ అల్లూరి జిల్లాలో భద్రంగా ఉండటం గమనార్హం. అయితే తగిన సంరక్షణ, గుర్తింపు లేకపోవడం వల్ల చారిత్రక సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ ఖజానా చెస్టులను వారసత్వ సంపదగా ప్రకటించి, ప్రముఖ మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చరిత్రాభిమానులు, స్థానికులు కోరుతున్నారు.

చింతపల్లి సబ్‌ట్రెజరీ కార్యాలయం

శిథిలమౌతున్న కర్ర చెస్టులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి -హుకుంపేట :మండలంలోని భీమవరం పంచాయతీ పరిధిలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ఈనెల 20 వరకు విజయవంతంగా నిర్వహించారు. ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, జాతీయ గీతాల పోటీలు నిర్వహించినట్లు కళాశాల ఫౌండర్ బ్రహ్మకుమారి ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ సన్నీ బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిట్టంపాడు సర్పంచ్ సన్నీబాబు మాట్లాడుతూ, విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సమాజాభివృద్ధికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ అధ్యక్షుడు శంకర్ నాయుడు, ఎంసీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విఘ్నేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మకుమారి స్వప్న, కాఫీ సంఘం అధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

ఫౌండర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

అస్తవ్యస్తంగా బొర్రా గుహల రోడ్డు

-అవస్థలు పడుతున్న పర్యాటకులు, ఆదివాసీలు

ప్రజాశక్తి-కాశీపట్నం :అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం పర్యాటకులతో ఎల్లప్పుడూ కిటకిటలాడుతోంది. అయినా బొర్రా గుహల రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ములియాగుడ (బొర్రా జంక్షన్) నుండి బొర్రా గుహల వరకు ఆరు కిలోమీటర్లు దూరం రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు పూర్తిగా రోడ్డు ధ్వంసమై కంకర రాళ్లు తెలీ గుంతలు గుంతలుగా ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. స్థానికులు, పర్యాటకులు ఈ ధ్వంసమైన రోడ్డు మార్గంలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ ధ్వంసమైన తారు రోడ్డు కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంతగా గుర్తింపు పొంది వేల సంఖ్యలో బొర్రా గుహలు పర్యాటకులతో కోట్లు సంపాదన వస్తున్నా రోడ్డు ఎందుకు మరమ్మత్తు చేయటం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ధ్వంసమైన బొర్రా గుహల రోడ్డును మరమ్మతులు చేయించాలని స్థానిక గిరిజనులు, పర్యాటకులు డిమాండ్ చేశారు.

రాళ్లు తేలి గుంతలుగా ఉన్న రోడ్డు

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : NARSIPATNAM (JUNIOR DIVISION)
O.S.187/2023

Between :
Kalla Nooka Raju ...Plaintiff
And
Saramanda Chandrakala ...Defendent

To,
Defendent :-

Suit Summans

Saramanda Chandra kala, w/o (Late) Satyanarayana, S/o Matsa Raju, G.T.W.A.H. School Teacher, R/o Aruku (v) Aruku Vally, Alluri Seetha Rama Raju Dist.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే.30-12-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున ఈ రోజు **ఉదయం 10.30ని॥లకు** మీరు స్వయంగా గానిలేక మీ తరపున అడ్వకేటు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీ పరోక్షమందు పై దావాను తీర్మానించబడునని ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

రుత్తల అప్పారావు
అడ్వకేట్, నర్సీపట్నం
సెల్ : 9849830515

నర్సీపట్నం
తేది 14.12.2025

రోడ్డు పనులు చేపడుతున్న గిరిజనులు

శ్రమదానంతో మట్టి రోడ్డు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పెదకోట పంచాయతీ పరిధి తోంకోటలో మట్టి రోడ్డు పనులను గిరిజనులు స్వచ్ఛందంగా శ్రమధానంతో చేపట్టారు. మట్టి రోడ్డును పూడ్చి వేసే పనులు చేపట్టారు. మండలంలోని గత రెండు మూడు దఫాలుగా సంభవించిన పలు తుపానుల కారణంగా మట్టి రోడ్డు అంతా గోతులు మయంగా ఏర్పడడమే కాకుండా రాళ్లు తేలాయి. కాలినడకన, బైక్, ఇతర 108 అంబులెన్స్ వంటి వాహనాలు తిరుగలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనులు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఇది ఇలా ఉండగా గత ఏడాది క్రితం పెద్దకోట పంచాయతీలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల .పవన్ కళ్యాణ్ డోలి రహిత రాష్ట్రంగా మారుస్తామని అడవి తల్లి బాట కార్యక్రమంలో తెలిపారు.గిరిజన గ్రామాలకు శాశ్వత తారు రోడ్లు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వాగ్దానాలు చేశారు. కానీ గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం కల్పించ లేదని గ్రామస్తులు వెంకట్, కె.దేముడు, పి.నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సురేష్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి- డుంబ్రిగుడ: స్థానిక ఎస్సైగా ఎల్ సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు ఎస్సైగా పని చేసిన ఆయన బదిలీపై డుంబ్రిగుడ ఎస్సైగా వచ్చారు. ఆయనకు సిబ్బంది సాదర ఆహ్వానాన్ని పలికి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ద్విచక్రవాహనంపై ఇద్దరూ హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి- వేపగుంట : ద్విచక్రవాహనంపై ప్రయాణించే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సిఐ కె.సురేష్ కోరారు. ఈ మేరకు సుజాత నగర్, ప్రహ్లాదపురంలో సిఐ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సలందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల వేపగుంట నుండి ఓల్డ్ గోశాల రోడ్డులో ద్విచక్రవాహన ప్రమాదం జరిగి ముగ్గురు చనిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. హెల్మెట్ లేని కారణంగానే వారు మృతిచెందారని తెలిపారు. గోపాలపట్నం, పెందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని బిఆర్‌టిఎస్ మధ్య రోడ్డులో ద్విచక్ర, ఆటోలు, పెద్ద వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించరాదని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్‌లో ఉదయం 10 నుండి రాత్రి 8 గంటలవరకు హెల్మెట్ లేని వాహనదారులకు పెట్రోల్ ఇవ్వరని తెలిపారు. అందరూ సహకరించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు.

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-వేపగుంట : కళాకారులను ఆదుకోవాలని మేయర్ పీలా శ్రీనివాసరావు కోరారు. జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంటలో బింగో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలు టివిలకు, సినిమాలకు పరిమితం కాకుండా ఇటువంటి కళాకారులను ప్రోత్సహించడం మంచిదన్నారు. డూపు లేకుండా లైవ్‌లో వారు చేస్తున్న ప్రదర్శన చాలా చక్కగా ఉందన్నారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో అల్లూరి విగ్రహ పునఃస్థాపన

- జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య కృషితో ఏర్పాటు
- సొంత నిధులతో విగ్రహం ఏర్పాటుకు చర్యలు

ఆవిష్కరణకు సిద్ధమైన అల్లూరి విగ్రహం

ప్రజాశక్తి- చింతపల్లి: స్వాతంత్ర సమరయోధుడు, గిరిజనుల గుండె చప్పుడు, అల్లూరి సీతారామరాజు విగ్రహం చింతపల్లిలో మళ్లీ గౌరవప్రదంగా నిలబడి ప్రజల హృదయాలను తాకుతోంది. కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురై, అవమానకర స్థితిలో పడివున్న అల్లూరి విగ్రహానికి జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య కృషితో తిరిగి జీవం పోసినట్లైంది. 516 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని తొలగించిన ఆర్అండ్‌బి అధికారులు దాన్ని పాడుబడిన భవనం పక్కన నిర్లక్ష్యంగా పడవేశారు. దీన్ని చూసిన తీవ్ర మనోవేదనకు గురైన గిరిజనులు, చైతన్యవంతులైన ప్రజలు, స్వాతంత్ర సమరయోధుడికి ఇంతటి అవమానమా? అంటూ ప్రశ్నించారు. ఈ పరిస్థితిని గమనించిన జడ్పిటిసి పోతురాజు బాలయ్య ముందుకు వచ్చారు. అల్లూరి ఆశయాలను గుండెల్లో పెట్టుకుని, విగ్రహానికి తగిన స్థానం కల్పించాలనే సంకల్పంతో సొంత నిధులు సమకూర్చి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శిలాఫలకం దిమ్మ ఏర్పాటు చేసి విగ్రహ పున్హస్థాపనకు చర్యలు చేపట్టారు. చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మర్యాదగా, గౌరవప్రదంగా నిలబెట్టించారు. దీంతో అల్లూరి విగ్రహం మళ్లీ ప్రజల చూపుల్లోకి వచ్చి, పోరాట స్ఫూర్తిని చాటిచెబుతోంది. ఈ సందర్భంగా పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధన పోతురాజు బాలయ్య వంటి ప్రజాప్రతినిధులతోనే సాధ్యమవుతుందని అన్నారు. అల్లూరి విగ్రహ పునస్థాపనకు ఉముందుకొచ్చిన ఆయనకు గిరిజన సమాజం రుణపడి ఉంటుందన్నారు. జడ్పిటిసి పోతురాజు బాలయ్యకు చింతపల్లి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలు

కాశీపట్నం: అనంతగిరిలో జన్మదిన వేడుకలు చేపడుతున్న నేతలు

సీలేరులో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కాశీపట్నం: అనంతగిరి మండల కేంద్రంలో అనంతగిరి మండల వైస్సార్సీపీ అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ సిఎం, వైసిపి అదినేత జనగ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ శకుంతల కేక్ కట్ చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు వైసీపీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ అనంతగిరి మండల పార్టీ అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ మాట్లాడుతూ, కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయవర్ధిని, అనంతగిరి మండలం వైస్ ఎంపీపీ జయవర్ధని, అరకు నియోజవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు రేగబోయిన స్వామి, మాజీ జడ్పీటీసీ దూరు గంగన్నదొర, అరకు నియోజవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు మహేష్, అనంతగిరి మండలం ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మారేడుమిల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కొండా జాకబ్, జెడ్‌పిటిసి గొర్లె బాలాజీబాబు ముఖ్య అతిథులు గా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వృద్దులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

సీలేరు: సీలేరులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం సెంటర్ వద్ద వైసిపి ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి సర్పంచ్ పాంగి దుర్గో, టౌన్ అధ్యక్షులు పేలూరి సత్యనారాయణ హాజరయ్యారు. వారి సమక్షంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దేవాది గణేష్, వెంకటరావు, నూకరాజు, పెద్ద, స్వర్ణలత కాంగ్రెస్ జిల్లా డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో జన్మదిన వేడుకలు

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి బస్ నుంచి జారిపడి టీచర్ మృతి

ఝాన్సీ (ఫైల్)

ప్రజాశక్తి -పాయకరావుపేట: ఆర్‌టిసి బస్సు నుంచి జారిపడి పాయకరావుపేట మండలం, ఎస్ నరసాపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఝాన్సీ ఆదివారం మృతి చెందారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాయకరావుపేట మండలం, ఎస్.నరసాపురం గ్రామంలో జడ్పీ హైస్కూల్ లో 2022 నుంచి హెచ్‌ఎంగా అనకాపల్లి నివాసి ఎం.ఝాన్సీ విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ముగించుకుని, పాయకరావుపేట ఆర్‌టిసి బస్టాండ్‌లో మిగతా ప్రయాణికులు పాటు అనకాపల్లి బస్ ఎక్కుతుండగా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఫుట్‌పాత్ పై కాలు జారిపోయి కింద పడిపోయారు. వెంటనే మిగతా టీచర్లు ఆందరూ ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని క్యూ1 ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఝాన్సీ మృతి చెందారు. ఉపాధ్యాయులు ఝాన్సీ మృతిపై ఎంఇఒలు కె.ఎస్.గాంధీ, జి.రమేష్‌బాబు పలువురు ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు

ఐదుగురు జూదరులపై కేసు

పట్టుబడిన జూదరులతో పోలీసులు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో పొలాల్లో బహిరంగంగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో శనివారం రాత్రి పట్టణ ప్రాంతంలో సిఐ అప్పన్న ఆదేశాల మేరకు ఎస్‌ఐ గోవింద ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి పేకాటాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. పేక ముక్కలతోపాటు రూ.4,600నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి మోటారు చోరీ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్, : యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం వద్దా సిద్ధి వినాయక డిఎన్ఆర్ ఫ్లైయాష్ బ్రిక్స్ సంస్థ వద్ద శనివారం రాత్రి బోరు పాయింట్ వద్ద నీటిమోటారు చోరీకి గురైంది.సంస్థ యజమాని దేవరపు ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం 3.30 సమయంలో అక్కడకు వెళ్లి చూడగా, మోటారు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్థానిక ఎఎస్ఐ చెల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా మియావాకి స్టోరీ టైమ్

ప్రజాశక్తి-సీతమ్మధార : పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సహకారంతో మియావాకి స్టోరీ టైమ్‌ను ఉత్సాహభరితంగా నిర్వహించారు. విశాఖపట్నంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 75 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక సెషన్లో క్రిస్మస్ ఆత్మను ప్రతిబింబించే కథనాలను మేళవించి, పిల్లలకు కథలు, సంగీతం, కదలికలు, పదసంపద అభివృద్ధి, కళలు సృజనాత్మక ఆటల ద్వారా ఆసక్తికరమైన వారాంతపు అనుభవాన్ని అందించారు. సర్టిఫైడ్ స్టోరీ టెల్లర్ ఆర్.వరలక్ష్మి, సంప్రదాయ జపనీస్ చెక్క థియేటర్ విధానమైన కమిషిబాయి ద్వారా క్రిస్మస్ కథను ప్రదర్శించారు. కథనాన్ని దృశ్యపరంగా అందంగా, ఆకర్షణీయంగా మార్చారు. పిల్లలకు ఎంతో ప్రీతిపాత్రమైన కథకురాలు ఎం.సీతాశ్రీనివాస్ యేసు జీవితం క్రిస్మస్ సంప్రదాయాలపై ఆధారపడిన సంగీతాత్మక కథనాన్ని అందించారు.

రాళ్లగెడ్డ పంచాయతీ ఏర్పాటు కోసం మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

పంచాయతీ విభజనకు ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి -జీకే వీధి : మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జెర్రీల పంచాయతీ 26 గ్రామాలకు సంబంధించి 13 గ్రామాలు జర్రెల రాళ్లగెడ్డ రెవెన్యూ గ్రామంలో నూతన పంచాయతీ ఏర్పాటు చేయుట గురించి రాళ్లగడ్డ, చింతలవాడ,కొండపల్లి, డబ్బగొంది,కొంద్రుపల్లి, గిల్లగొంది,పెద్దరు గొంది, గడిమామిడి, కన్నెరశిల్ప, గునుకురాయి,తిరగల్ల మామిడి,అసంపల్లి బోడలగుంది, పులిగొంది గ్రామాల ప్రజలు 1350 మంది జనాభాతో జే.రాళ్లగడ్డ నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి తీర్మానం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశామని జెర్రిల పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు. సర్పంచ్, కూటమి నాయకులు పోత్తూరు విష్ణుమూర్తి చిక్కుడు అశోక్, రీమల బుజ్జిబాబు, ముర్ల సంతోష్ వార్డు మెంబర్లు పిసా సభ్యులు వైసిపి నాయకులు జోబ స్వామినాథం 13 గ్రామాలకు సంబంధించిన గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా చిత్రలేఖనపోటీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో ఎపి జెన్కో కల్యాణ మండపంలో ఆదివారం చిత్రలేఖన పోటీలు ఎపి గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి జెన్కో ఇఇ రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి పిహెచ్‌సి వైద్యాధికారి అఖిల్, హోమియో వైద్యాధికారి సృజనారాయ్ కళాశాల ప్రిన్సిపల్ శంకరరావు, ఎస్ఐ యాసిన్, జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం నాగభూషణం హాజరయ్యారు. ఎపి గురుకుల పాఠశాల జిల్లా పరిషత్ డిఎవికి చెందిన విద్యార్థులు 228 మంది పోటీల్లో పాల్గొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, గంజాయి నుంచి యువతను కాపాడుదాం రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి ఫలితాలు త్వరలో ప్రకటించనున్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలను స్థానిక రామాలయం సమీపంలో త్వరలో ప్రదర్శించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు భానుప్రకాష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - జికెవీధి : మండలంలోని రింతాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మఠం ఝాన్సీ అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆమె మృతి చెందినట్లు సహచర ఉపాధ్యాయులు తెలిపారు. ఝాన్సీ స్వగ్రామమైన పెదబయలు మండలం రూఢకోట గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు. ఆమె మృతిపై విద్యాశాఖ అధికారులు గోవింద పడాల్, రామన్న సహచర సిబ్బంది, విద్యాకమిటీ చైర్మన్ మొట్టడం శరభన్నదొర పలువురు సంతాపం తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యం కోసమే వైద్యశిబిరం

నారా భువనేశ్వరి
వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -రాజవొమ్మంగి/ రంప చోడవరం: గిరిజనులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు నారా భువనేశ్వరి పేర్కొన్నారు. రంపచోడవరం సమీపం లోని యూత్‌ట్రైనింగ్ సెంటర్ ఎన్టీఆర్ మెమోరి యల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిఎస్ఎల్, జిఎస్ ఆర్ ఆస్పత్రుల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ట్రస్ట్ అధినేత నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1997లో ట్రస్టు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకూ 16,360 వైద్యశిబిరాలు, సంజీవిని ద్వారా 2,180 క్యాంపులు నిర్వహించామన్నారు. 4 బ్లడ్‌బ్యాంకులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్‌కు అనేకమంది దాతలు కూడా సహకారం అందిస్తున్నారన్నారు. శిబిరానికి హాజరైన వైద్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యశిబిరం నిర్వహించినందుకు భువనేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ శాసన సభ్యురాలు వంతల రాజేశ్వరి మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పలుసేవలు అందించారన్నారు. ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్, ఎస్పి అమిత్‌బర్దన్ నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మాజీ శాసన సభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు చిన్నంబాబు రమేష్, ఎస్టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత, గిడ్డి ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మాజీ డిజిపి రాజేంద్రకుమార్, సిసిఓ గోపి ఏర్పాట్లు పర్యవేక్షించారు. రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. రంపచోడవరం వాలంటరీ కందుల సాయి దంపతులు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళంగా చెక్కును భువనేశ్వరికి అందజేసారు. చారిటబుల్ ట్రస్ట్ అధినేత గోరంట్ల రఘు రవి రామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భువనేశ్వరి

పోలియో నిర్మూలనకు ప్రభుత్వం కృషి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

రాజవమ్మంగి : పోలియో చుక్కలు వేస్తున్న పిఒ స్మరణరాజ్

పాడేరులో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపి తనూజారాణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పోలియో నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దీనికోసం ఎక్కడికక్కడ పోలియో క్యాంపులను ఏర్పాటు చేశామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం రంపచోడవరం పంచాయతీ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ పరిధిలోని 19 పిహెచ్‌సిల పరిధిలో 18,164 మందికి పోలియో చుక్కలు వేయుటకు, 591 పోలియో కేంద్రాలు,75 రూట్లు, 28 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 22,23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సరిత, డాక్టర్ వినోద్, ఎంపిడిఒ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ రాజు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, హెచ్‌వి జానకి, వీఆర్ఒ మార్తమ్మ, సూపర్‌వైజర్ విజయకుమారి, వెంకటరమణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం : వై రామవరం మెయిన్ రోడ్‌లో ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేశారు. కోట చవిటి దిబ్బలు, పి.ఎర్రగొండ పనసలపాలెం, యార్లగడ్డ సంత మార్కెట్‌లో పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ చైతన్య తెలిపారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు, దారకొండ పిహెచ్‌సిల్లో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. 52 గ్రామాల్లో 22 పల్స్ పోలియో కేంద్రాల బూత్‌లు ఏర్పాటు చేసి 99 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసామని వైద్యాధికారి నారాయణరావు తెలిపారు. దారకొండ పిహెచ్‌సి పరిధిలో 23 బూత్‌ల్లో 1650 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి బాబ్జీ వెల్లడించారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి పిహెచ్‌సి పరిధిలో ఐదు సబ్ సెంటర్ల పరిధిలో మొత్తం 9 పోలియో కేంద్రా ఏర్పాటు చేశారు. 1105 మందికి పోలియో చుక్కలు వేయడం జరి గిందని అధికారులు తెలిపారు.మిగిలిన పిల్లలను గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దినేష్‌వర్మ, జెడ్పిటిసి గొర్లె బాలాజీబాబు పాల్గొన్నారు.

కాశీపట్నం: అనంతగిరి మండలంలోని లంగుపర్తి పి.హెచ్.సి వైద్యాధికారి మంజుభార్గవి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసిరావు, మాజీ జడ్పిటిసి దూరు గంగన్నదొర, హెల్త్ సూపర్వైజర్ రాజారావు, ఎమ్.ఎల్.హెచ్.పి సుధ లత, సువర్ణ, ఎ.ఎన్.ఎమ్.లు లీలావతి, నిర్మల, హెల్త్ అసిస్టెంట్లు నారాయణరావు, కాశీనాయుడు పాల్గొన్నారు.

పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీలో తొలి విడత పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతం అయ్యిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి కృష్ణమూర్తినాయక్ వెల్లడించారు. జిల్లాలోని పలు పిహెచ్సిలను ఆయన సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ, తొలి విడత తొలి రోజు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఒక లక్ష 12 వేల 839 మంది 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కేంద్రాన్ని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి పర్యవేక్షించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో 64 పిహెచ్‌సిల పరిధిలో 1,29,959 మంది చిన్నారుల లక్ష్యంగా వ్యాక్సిన్ వేయవలసి ఉందని, ఈ మేరకు మిగిలిన చిన్నారులందరికీ 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా అందించాలని ఆదేశించారు. పిహెచ్‌సి వైద్యాధికారి సాయిశ్రీ పాల్గొన్నారు.

అనంతగిరి :మండల కేంద్రంలో స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, సంతకు మారి, సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు

డుంబ్రిగుడ: మండలంలో పల్స్ పోలియో ఆదివారం విజయవంతంగా జరిగింది.అరమ పంచాయతీలో పిఎ సిఎస్ బ్యాంక్ అధ్యక్షుడు సుబ్బారావు పోలియో చుక్కలు వేశారు. డుంబ్రిగుడ, కిల్లోగుడ పిహెచ్‌సి వైద్యాధికారులు పి.రాంబాబు, కుమార్ రత్న పాల్గొన్నారు.

11వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోకు విశేష స్పందన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలో నిర్వహించిన 11వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోకు డెవలపర్లు, కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ ఎక్స్‌పోను 14 వేల మందికిపైగా సందర్శించారు. తొలిసారి ఇళ్లు కొనుగోలు చేసేవారు, పెట్టుబడిదారులు, ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాంతానికి చెందిన ప్రముఖ డెవలపర్లు 850కు పైగా నివాస, వాణిజ్య ప్రాజెక్టులను ప్రదర్శించారు. గృహ రుణాలు, ఇతర సేవల కోసం బ్యాంకులు, అనుబంధ సంస్థలు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ, ఇటీవల విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఇ.అశోక్‌కుమార్ మాట్లాడుతూ, భారీ సందర్శకుల హాజరు, నాణ్యమైన విచారణలు, తక్షణ బుకింగ్‌లు, అనంతర సైట్ విజిట్లతో ఎక్స్‌పో అంచనాలను మించిన విజయాన్ని సాధించిందన్నారు. కేతన్ గార్గ్ తీసుకువచ్చిన వేగవంతమైన ప్లాన్ అనుమతులు, ఈ రంగానికి కొత్త ఊపునిచ్చాయని క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ వి ధర్మేందర్ చెప్పారు.

అనంతగిరిలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

మారేడుమిల్లి: పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ దినేష్‌వర్మ

దారకొండలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి బాబ్జీ